# పుట్టిన రోజు

రచన :
"వాహిని"

సాయంకాలం నిన్న మొన్నటి వరకూ డాబా పైనిల్చుని పశ్చిమాద్రివైపు పయనించే పక్షుల్ని చూస్తూ, ఆకలిని మర్చిపోయి, తనో పక్షై వాటితో ఎగిరిపోతే బాగుణ్ననుకునే కృష్ణారావు నేడు అలా అలా ఎగిరే పక్షులు టకేల్ మని క్రింద పడిపోతే ఎంత బాగుండేదనుకున్నాడు. తన దృష్టి తూర్పువైపును మరల్చాడు. ఈనిన వరిచేలు నిండు ముత్తైదువులా వున్నా భర్తలేని స్త్రీకి గర్భం వస్తే చూసినట్లు నిరసనగా చూసి వుత్తరంవైపు తిరిగాడు. ఇంటి కప్పుల్లేని పాతగోడలు, వాటి మధ్యల్లో గుబుర్లుగా నున్న చింత, తుమ్మచెట్లు అదో వింత అందంగా వున్నా నేడు శీలాన్ని కోల్పోయిన స్త్రీల్లా కప్పులేని గోడలు, శీలాన్ని హరించివేసిన ఆగంతకుల్లా తుమ్మ, చింత చెట్లు 'ప్చ!' అనుకొని పడమర వైపు తిరిగాడు. అంతా వూరే దక్షిణంవైపుకూడా వూరే. ఎక్కువ డాబాలు, రెండు మూడంతస్థుల తెల్లని భవనాలే, కాని అచ్చటచ్చట తెల్ల వస్త్రాలకి మాసికలు వేసినట్లుగా వున్న పెంకుటిండ్లు, రేకుల యిండ్లూను.

అప్పుడప్పుడే చీకటి తెరలు వ్యాపిస్తున్నాయి కృష్ణారావులోని విషాదంలా. జేబులోంచి వుత్తరం తీసాడు. అది పన్నెండేళ్ళ తమ్ముడు వ్రాసింది. చదువుదామంటే అక్షరాలు కన్పించలేదు. డాబా దిగి రూములోకి వెళ్ళాడు—"అన్నయ్యా, నీ పుట్టినరోజు యింకా రెండే రోజులుంది. పోయినసారి నీ పుట్టినరోజుకి పండగ గ్రాండ్ గా చేయలేదు. అప్పుడు ఆర్థిక యిబ్బందులుండేవి. ఇపుడు లేవు కాబట్టి ఈ పుట్టినరోజుకి పండగ గ్రాండ్ గా చేస్తానంది అమ్మ. అందువల్ల నీవు తొందరగా రాగలవు. వస్తువస్తు పిల్లలకి పంచిపెట్టడానికి కొన్ని బిస్కట్స్ ల పాకెట్స్ తేగలవు. ఎందుకంటే ఇచ్చటనే కొందామంటే ఖరీదెక్కువ. తప్పకుండా రాగలవు."

ఇట్లు
నీ తమ్ముడు,
రామారావ్.

ఉత్తరాన్ని మడచి, ఒక నిట్టూర్పు విడిచి జేబులో పెట్టుకున్నాడు. హు!...తను ఉద్యోగమే చేస్తున్నాననుకుంటున్నారు పిచ్చివాళ్ళు...ఓ...పోయిన పదిహేనవ తారీఖుకి డబ్బు పంపాను గదూ! అందుకే అనుకుంటున్నారు. తన వుద్యోగం వూడి పదిహేనురోజులు కావస్తుందని వాళ్ళకేం తెల్సు. తను వుత్తరంలో వ్రాస్తే తెలిసేది గాని మరో వుద్యోగం వచ్చే వరకు తెలుపకూడదనుకున్నాడు. వుద్యోగం దొరికేలా లేదు. ఇంటికి పంపగా మిగిలిన డబ్బు అయిపోయింది. అంతలోనే పుట్టినరోజు వచ్చిందది—

కృష్ణారావు పుట్టిన రోజు న్నే శ్రీకృష్ణుడు పుట్టాడు. కాదు, శ్రీకృష్ణ జయంతి నాడే కృష్ణారావు జన్మించాడు. భగవాన్ స్వరూపుడైన శ్రీకృష్ణునికి, మానవస్వరూపుడైన కృష్ణారావుకి భూమికి ఆకాశానికి మధ్యగల తేడా. చెప్పుకోదగ్గవి కాని పోలికలు—

కృష్ణారావు పుట్టినప్పుడు రాక్షులేం మూర్ఛపోలేదు గాని, వారసులు లేని కృష్ణారావు తండ్రి ఆస్తిని కభళించడానికి ఉవ్విళ్ళూరే కృష్ణారావు పాలివాండ్లకు మూర్ఛ వచ్చినంత పనయింది. శైశవదశలో శ్రీకృష్ణునిలా గోపికలతో కేరింతలు కొడుతూ వెన్నముద్దలు మింగకున్నా, పదమూడేళ్ళవరకూ అనారోగ్యంతో బాధపడుతూ టాబ్ లెట్స్, కాప్స్యూల్స్ మింగాడు. ఆ తర్వాత ఆరోగ్యవంతుడై చదివి పెద్దవాడై డిగ్రీ పూర్తి చేసి అదృష్టం వరించిందనుకున్న కృష్ణారావుకు, తండ్రి గుండె జబ్బుతో మంచం పట్టడం, ఉన్నయావదాస్తి తండ్రి వైద్యానికి హారతి కర్పూరంలా హరించుకుపోవడం, అప్పుల పాలవడం, అయినా ఫలితం దక్కక తండ్రి గతించడంతో దురదృష్టమే కృష్ణారావుని వరించిందని చెప్పొచ్చు.

దాంతో కృష్ణారావు వుద్యోగాన్వేషణ చేయడం, ఓ స్నేహితుని తండ్రి ధర్మమా అని కండక్టరు పోస్టు హైదరాబాదులో దొరకడం, హైదరాబాదులో డాబాలో ఓ రూము అష్టకష్టాలు పడితే దొరకడం.

ఆ ఉద్యోగం కాస్తా ఆరునెల్లు తిరక్కముందే వూడిపోవడం అంతా పీడకలలా జరిగిపోయింది. 'ఈ ఉద్యోగం వూడిపోయిన సంగతి అమ్మకు తెలిస్తే ఎంత బాధపడుతుంది' అప్రయత్నంగానే కృష్ణారావు కళ్ళమ్మట నీళ్ళు రాసాగాయి. 'ఛీ' పుట్టినరోజుకూడా బాధపడ్డమేమిటి? సంతోషపడాలి, తృప్తి పడాలి, ఆనందపడాలి. కాని సంతోషం, తృప్తి, ఆనందం వాటంతటనే మన దగ్గరికి రావు. మనం అనుకోడంలో వుంది.

కారులో ప్రయాణించే వ్యక్తి తృప్తి పడవచ్చు. కటిక చీకట్లో వర్షంలో తడిసిన ప్రయాణీకుడూ తృప్తి పడవచ్చు.

ప్రొద్దుకు ముప్పూటలా తినివున్న వ్యక్తి తృప్తిపడవచ్చు, రోజుకు ఒకే మారు తినే అభాగ్యుడూ తృప్తి పడవచ్చు.

గులాభి వాసనల్ని చూసే వ్యక్తి ఆనందం పడవచ్చు, అదే వ్యక్తి గడ్డిపువ్వులోని సువాసల్ని ఆఘ్రాణించగల్గి ఆనందపడవచ్చు.

రూముకి తాళం వైచి బయటకొచ్చాడు కృష్ణారావు. జేబులు తడుముకున్నాడు. రెండు రూపాయల నోటు మాత్రమే వుంది. ఇదే డబ్బు మరో వుద్యోగం దొరికేవరకు సరిపోవాలి ... పైసల్ని చూసేసరికి కడుపులో కలకలం లేసట్లయింది. హోటలువైపు దారిదీసాడు.

అందానికి, మన్నికకు
రోజా
Regd.No 221631
బనియన్లనే వాడండి

సింగల్ టీ త్రాగాడు. రెండు రూపాయల నోటు చిల్లరగా మారింది. చిల్లరవైపు ఒకసారి దీనంగా చూసాడు. లేవనే భవిష్యత్తు భయంకర రాక్షస కన్పించసాగింది కాని తాను తృప్తికోసం రూమునుండి బయటకొచ్చాడు కాబట్టి, దాన్ని మర్చిపోయి హోటల్ నుండి బయటకొచ్చాడు, రూమువైపుకు దారిదీసాడు.

తన పుట్టిన రోజు పండక్కి ఘనంగా జరిపేవారు ప్రతిసారి తల్లిదండ్రులు. అన్నదానం చేసేవారు,

రవీంద్ర ఆర్టు పిక్చర్స్‌వారి 'అమ్మా నాన్న' చిత్రంలో ఒక దృశ్యం.






వస్త్రాలు బీదలకు పంచేవారు. ప్రతిసారి ఏదైనా పండక్కి ఘనంగా జరుపుతూ ఒకేసారి దివాలా తీసినట్లు జరుపుకోక పోవడం ఎవరికైనా నామోషి అనిపిస్తుంది. కృష్ణారావు కలాగే అనిపించింది, ఎంత తృప్తిపడదామన్నా కూడా.

విద్యుద్దీపాలు దేదీప్యమానంగా వెలుగుతున్నాయ్. ట్యూబ్ లైట్ల వెలుగు పాలలా స్వచ్ఛంగా వుంది. ప్రక్కన గందరగోళంగా మనుషుల కలకలం విన్పించింది, ఆవైపు చూసాడు. అది సంధిలాగుంది. సంది చివర్లో పెద్ద బంగళా. బంగళా వరాండాపై జనం కూర్చుని భోజనం చేస్తున్నారు. సంతర్పణ లాగుంది. "అరె! యింతకుముందు యిచ్చటినుండి వెళ్ళేటప్పుడు తను చూళ్లేదేమిటి?" అనుకుని, ఆ జనం వున్న దగ్గరకు వెళ్ళాడు. బంగళా వరండా చాలా విశాలంగా వుంది. చిన్న పెద్ద, ముసలి ముతక, ఆడ మగ, అందరూ కూర్చుని భోజనం చేస్తున్నారు. 'వివాహం కావచ్చు' ననుకున్నాడు. 'కాని వివాహ మయితే పచ్చని పందిరి వుండాలిగా!' కాదు సంధికి కుడి ప్రక్కలో అంతా అంగవైకల్యులైన బిచ్చగాళ్ళున్నారు. సంధికి ఎడమ ప్రక్కలో ఓ చెత్తకుండీ కూడావుంది. దాని ప్రక్కన కుక్కలు ఎంగిలి స్తిరాకుల్ని నాకుతూ కీచులాడుకుంటున్నాయి. ప్రక్కనున్న ఓ వ్యక్తి నడిగాడు. ఆ బంగళా యజమాని వారసుని పుట్టిన రోజు పండగని సంతర్పణ జరుగుతుందని చెప్పాడు. యింకొంచెం ముందు కెల్లాడు. బంగళా వరండాపై ఎక్కే మెట్లకు రెండు మీటర్ల దూరంలో వున్నాడు. అతని దృష్టి వడ్డిస్తోన్న ఓ స్త్రీ చీర చెరగుని పట్టుకుని లాగుతున్న చిన్ని అబ్బాయి పైపడింది. చూపరులకి అబ్బాయి రూపం లడ్డూని జ్ఞప్తి తెచ్చేలాగుంది. అబ్బాయి మెడలో ఒంటిపేట బంగారుగొలుసుంది. ఆ స్త్రీ వైపు చూసాడు. ఆవిడ అపర లక్ష్మీదేవిలా ఒంటిపై నగలతో వుంది. ఆమె ఆ అబ్బాయి తల్లి కాబోలు. ఆ అబ్బాయి వునికినే మరిచి వడ్డిస్తోంది. అబ్బాయి



♦

'పిచ్చిమారాజు' చిత్రంలో

ధూళిపాళ,

అల్లు రామలింగయ్య.

అంజలీదేవి.

♦

తల్లిని వదలి వెనక బడ్డాడు. అబ్బాయి వరండా రెండువైపులు అలా కూర్చుని భోజనం చేస్తున్న వారి మధ్యనుండి భూమిపై చేతులుంచి, మోకాళ్ళతో నడుస్తూ, భోజనం చేస్తున్నవారివైపు విచిత్రంగా చూస్తూ, అచ్చటచ్చట ఆగుతూ మెడలోని బంగారు గొలుసుని నోటితో కొరుకుతూ, దాన్ని తన బలంకొద్దీ తెంచేయడానికి ప్రయత్నిస్తూ మళ్ళ మోకాళ్ళతో నడుస్తూ వస్తున్నాడు. అప్పుడప్పుడు నోటితో ఏదో మూగవానిలా మాట్లాడుతున్నాడు. ఆ అబ్బాయిని చూస్తు పరిసరాలు మర్చేడు కృష్ణారావు.

" బాబూ ! యిలా వచ్చి కూర్చో వడ్డిస్తాను " అని వరండాపైకి దారి చూపుతోందో ఆవిడ. వాస్తవంలోకి వచ్చాడు.

" తన తల్లికూడా తన పుట్టిన రోజు పండక్కి యిలానే అందరినీ ఆహ్వానిస్తు వడ్డించేది కాబోలు " ననుకున్నాడు. అతని దృష్టి యింకా ఆ అబ్బాయి పైన్నే వుంది. మరో స్త్రీ బిచ్చగాళ్ళకు తలా ఒక విస్తరియిచ్చి వడ్డిస్తోంది. అందరికి వడ్డించి అబ్బాయి వైపు చూస్తున్న కృష్ణారావును విచిత్రంగా చూసే లోనికి వెళ్ళిపోయింది.

ఆ అబ్బాయి వరండాపైకి వెళ్ళే మెట్లవద్దకొచ్చి దిగడానికి ప్రయత్నిస్తున్నాడు. ఒక మెట్టు దిగాడు. మరో మెట్టు దిగబోయాడు అంతే ! అబ్బాయి బంతిలా దొర్లడం, కృష్ణారావు ఒళ్ళులో అబ్బాయిని దెబ్బ తగలకుండా ఆపి ఎత్తుకోవడం, అబ్బాయి కెవ్వుమని అరవడం, బిచ్చగాండ్లకు వడ్డించిన స్త్రీ శాకం (కూర) వడ్డించడానికి తప్పాల తెస్తు దొంగ...దొంగ...అని అరవడం, పదిమందివరకు కృష్ణారావును చుట్టిముట్టి పట్టుకొని టపటపా బాదడం నిముషంలో జరిగిన సంఘటన.

" ఎంత ధైర్యం ! ఎంత ధైర్యం దొంగవెధవకి. యిక్కడనే భోజనం చేస్తున్న యింతమంది కళ్ళుకప్పి బుజ్జిగాడు (అబ్బాయి) మెడలోని గొలుసును కాజెయ్యాలని చూసాడు. అసలిలాంటి వెధవల్నే నమ్మకూడదు. చూస్తే చదువుకున్న కుర్రాడిలా వున్నాడు. చేసేది దొంగతనం ఛీ ! ఎందుకూ !




లోకమే మారిపోయింది. మనిషికి మనిషి నమ్మేలాలేదు దినం " అంది ఆవిడ.

" నేను ఈ ముష్టి వెధవని వచ్చినసుండి గమనిస్తూనే వున్నా, వాని చూపే దొంగ చూపులాగుంది. అసలు నేననుకున్నట్లే అయింది " అందో భవిష్యత్తు గూర్చి తెల్పని భ్రమపడే స్త్రీ.

" యింకా నయం అబ్బాయి ఏడ్చాడు కాబట్టి సరిపోయింది, లేకుంటే గొలుసు లాక్కొని దాన్ని ఏం చేసేవాడో దొంగ వెధవ ! " అని అబ్బాయి తల్లి భయంగా అంది.

ఇవన్నీ కృష్ణారావుకు వినిపించడం లేదు. వాళ్ళు వున్నవాళ్ళు కాబట్టి (అంటే టెలిఫోన్ వుంటుందని గమనించదగ్గ విషయం) నిముషాల్లో పోలీస్‌లను రప్పించారు.

అయోమయంలోంచి తేరుకొని కృష్ణారావు పరిస్థితిని అర్థంచేసుకొని దైన్యమంతా కళ్ళలోకి ప్రస్ఫుటం చేస్తూ తనవైపొచ్చే పోలీస్‌లవైపు చూసాడు. —పుట్టిన రోజు అయినా, తృప్తి, సంతోషంగా వుందామనే నిమిషతోవచ్చి ఒక మంచి పనిచేయబోయి, అపార్థాలపాలై కొన్ని నిముషాల్లో శ్రీ కృష్ణ జన్మస్థానాన్ని సందర్శించేడు కృష్ణారావు.